# రాజకీయ కపటత్వం గురించి, విధ్వంసక అభివృద్ధి గురించి

మామూలుగా ఎన్నికలొస్తే ఎవరికి ఓటు వేయాలా అని ప్రజలు ఆలోచిస్తారు. ఈసారి మాత్రం అందరికీ ఓటువేసి అందరినీ గెలిపించే మార్గమేమీ లేదా అన్న ఆలోచన ప్రజలకు వచ్చి ఉంటుంది. ఒకరికి ఓటేస్తే ఇంకా ఎక్కువ చవకబియ్యం, ఇంకా ఎక్కువ గంటల ఉచిత కరెంటు దొరుకుతాయి. మరొకరికి వోటేస్తే కలర్ టీవీలు, పని దొరికినా దొరకకున్నా వెయ్యి నుండి రెండువేల రూపాయల నెలజీతం దొరుకుతాయి. వేరొకరికి వోటేస్తే 100 రూపాయలకే కుటుంబ కనీస అవసరాలన్నీ ఒనగూడుతాయి. ఇంకొకరికి వోటేస్తే ఉచితంగా మొబైల్‌ఫోన్లు, చవకగా లాప్‌టాప్ కంప్యూటర్లు దక్కుతాయి. ఒకరికే ఓటేసి వేరేవన్నీ పోగొట్టుకోవడం ఎందుకు? అందరికీ వోటేసి అందరినీ గెలిపించుకొని అన్నీ పొందే మార్గం లేదా? అయినా ప్రజలను ఇంతగా ప్రేమించే వాళ్లు వేరు వేరు పార్టీలు పెట్టుకుని ఒకరినొకరు తిట్టుకుంటారెందుకు? అంతా కలిసి ఒకే పార్టీ పెట్టి ప్రజలకు అన్నీ ఉచితంగా ఇచ్చేయొచ్చుకదా?

మనల్ని పిచ్చివాళ్లుగా వాళ్లు భావిస్తున్నారేమోగానీ మనం పిచ్చివాళ్లము కాము కాబట్టి కొన్ని ప్రశ్నలు వేసుకుందాం; ఎన్నికలలో పోటీ చేస్తున్న పార్టీలనూ అభ్యర్థులనూ కూడా కొన్ని ప్రశ్నలడుగుదాం. ఇప్పుడడగకపోతే మళ్ళీ అయిదేళ్ల దాకా వాళ్ళు మన గడప తొక్కరు కాబట్టి ఇప్పుడే అడుగుదాం.

వాళ్లు మాట్లాడని విషయాల గురించి, ఇవ్వని హామీల గురించి అడుగుదాం. ఏవేవో హామీలు ఇస్తున్నారు గానీ రాష్ట్రంలో ప్రజా జీవితాన్ని చాలా ఏళ్లుగా కుదిపేస్తున్న ముఖ్యమైన సమస్యల గురించి నిర్దిష్టమైన ఏ హామీ ఎందుకు ఇవ్వడం లేదో అడుగుదాం. దానితోపాటు, ఇస్తున్న హామీలు నిలబెట్టుకోవడానికి అయ్యే ఖర్చు కోసం మననుండి ఏమేమి తీసుకుంటారో ఆలోచిద్దాం. ఒక చేత్తో ఇవ్వడం కోసం రెండో చేత్తో ఏమి తీసుకుంటారో చూద్దాం. వాటిని గురించి కూడ అభ్యర్థులనూ పార్టీలనూ అడుగుదాం.

## ఇవ్వని హామీలు

### 1. విద్య



ఇవ్వాళ కడు బీద కుటుంబాలలో సహితం తల్లిదండ్రులు తీవ్రంగా తపన చెందుతున్నది పిల్లల చదువుల గురించి. ఎట్లాగయినా వాళ్లను చదివించుకుంటే తమకంటే బాగా బతుకుతారని వారి ఆశ. దీనికోసం ఉన్నది అమ్మి, లేనిది అప్పు తెచ్చి గ్రామీణ ప్రాంతాలలో సహితం వెలిసిన ప్రైవేట్ స్కూళ్లకు పిల్లలను

# పార్టీలనూ, అభ్యర్థులనూ అడగొద్దా మనం?

పంపిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు కొల్లలుగా ఉన్నా, వాటిలో పంతుళ్లు పంతులమ్మలు వేల సంఖ్యలో ఉన్నా ప్రైవేట్ స్కూళ్లకు పంపే అవకాశం అసలే లేనివారు తప్ప వేరే ఎవ్వరూ పిల్లలను ఆ పాఠశాలలకు పంపడం లేదు. అవి నిరుపేద ఎస్‌సి, ఎస్‌టి, వెనుకబడిన వారిలోకీ వెనుకబడిన బిసి కులాల పాఠశాలలు అయ్యాయి. **ఈ స్థితిని పోగొడతామనీ పిల్లలందరూ తమ భవిష్యత్తుపైన భరోసాతో ప్రభుత్వ పాఠశాలలలో విద్యపొందే అవకాశం కల్పిస్తామనీ ఒక్క పార్టీ అయినా హామీ ఇస్తున్నదా? ఎందుకియ్యరు?**



## 2. వైద్యం

పిల్లల చదువుల తరువాత ప్రజలు ఎక్కువగా ఖర్చు పెట్టుకొంటున్నది, ఉన్న కొద్దిపాటి ఆస్తులు అమ్మి, తాకట్టుపెట్టుకుని, బికారులవుతున్నది ఆరోగ్యం గురించి. మందులు లేని, డాక్టర్లు రాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పోయేబదులు శిక్షణలేని ఆర్‌ఎంపి నుండి ఉన్నదంతా వదిలించే కార్పొరేట్ ఆస్పత్రులదాకా ఎక్కడికయినా పోవడం శ్రేయస్కరం అన్న అభిప్రాయానికి ప్రజలను నెట్టింది మన ప్రజారోగ్య వ్యవస్థ. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకే కాదు, ఒకనాడు పేరు పొందిన ప్రభుత్వరంగ వైద్యకేంద్రాలయిన హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియా ఆస్పత్రులకు, వరంగల్‌లోని గాంధీ ఆస్పత్రికి, కర్నూలు, గుంటూరు జనరల్ ఆస్పత్రులకు, విశాఖపట్నం కింగ్ జార్జి ఆస్పత్రికి కూడా ఇదే గతి పట్టించారు. **ఈ స్థితిని పోగొడతామనీ ప్రజలందరూ తమ ఆరోగ్యంపైన భరోసాతో ప్రభుత్వ వైద్యశాలలోనే చికిత్స పొందే అవకాశం కల్పిస్తామనీ ఏ ఒక్క పార్టీ అయినా హామీ ఇస్తున్నదా? ఎందుకివ్వదు?**

ప్రైవేటు రంగంలో ఉన్నత విద్య పొందే విద్యార్థులలో అత్యధిక భాగానికి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదా, 500 పైగా తీవ్రరోగాల చికిత్సకు ఆరోగ్యశ్రీపథకం ద్వారా పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం అందించడం లేదా అని కాంగ్రెస్ పార్టీ అంటుంది. అవును ఇస్తున్నారు. అందిస్తున్నారు. ఉన్నతస్థాయి విద్యను చేరుకోవడానికి చిన్నప్పటినుంచి చదువుమీద పెట్టే ఖర్చుకు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనిదే నిజమైన పేదలలో ఎంతమంది ఇందులో మొదటి వసతిని అందుకోగలరని పాలకులను అడిగితే వారివద్ద జవాబులేదు. ఇక రెండవ వసతి మాటకొస్తే, వారిచ్చే ఉచిత కార్పొరేట్ వైద్యానికి ప్రజలు అదనంగా పెట్టుకోక తప్పని ఖర్చెంతో తెలుసునా అని అడిగినా పాలకులవద్ద జవాబులేదు. అత్యధికంగా ప్రాణాలు తీసే అతిసార, మలేరియా వ్యాధులకు, లక్షల సంఖ్యలో ప్రజలను ఆస్పత్రులపాలు చేస్తున్న వైరల్ ఫీవర్లకు, అన్ని రోగాలకు మూలం అయిన తీవ్రపోషకాహార లోపానికి ఏ ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని అడిగినా జవాబులేదు.

ప్రజలకు విద్యా వైద్య రంగాలలో ప్రైవేట్ వ్యాపారుల చేత ఉచిత సేవలిప్పించే పేరిట వారి వ్యాపారాన్ని పదిలపరిచే ఈ కోట్ల రూపాయల దానం బదులు అదే ధనాన్ని ప్రభుత్వ విద్యా వైద్య రంగాల మెరుగుదలకు వినియోగించి ఆ వ్యవస్థలను బాగు చేయడం ఉచితమైన విధానం కాదా? అవునని నిస్సంకోచంగా కాంగ్రెస్సే కాదు, ఏ పార్టీ ఎందుకనదు? **మేము అధికారంలోకి వస్తే విద్యా వైద్యరంగాల ప్రైవేటీకరణను నిరోధించడానికి ప్రభుత్వ వ్యవస్థలనే సమర్థంగా తయారు చేస్తామని ఏ ఒక్కరూ ఎందుకు హామీ ఇవ్వరు?**

దీనికి కారణం మనకు తెలియనిది కాదు. విద్యా వైద్య రంగాల ప్రైవేటీకరణ రాష్ట్ర ఆర్థిక పురోగమనంలో ముఖ్యపాత్ర నిర్వర్తించగలదని చంద్రబాబు నాయుడు విజన్ 2020లో ప్రకటించిన నాటినుండి మన రాష్ట్రంలో ఆ రెండు వ్యాపారాలూ వేగంగా వర్ధిల్లుతున్నాయి. వారి పార్టీకి చెందినవారు, కాంగ్రెస్ పార్టీకి చెందినవారు, కొత్తగా పుట్టిన చిరంజీవి పార్టీకి చెందినవారు, కొండొకచో వామపక్ష పార్టీలకు చెందినవారు ఈ రెండు వ్యాపారాలలో భారీగా పెట్టుబడులు పెట్టారు, భారీగా సంపాదించుకుంటున్నారు. వారి ప్రయోజనాలకు ఏ పార్టీ ఇవ్వాళ నష్టం కలిగించడానికి సిద్ధంగా లేదు. **ఉందా అని వాళ్లను మనం అడగొద్దా?**



## 3. వ్యవసాయం

రైతులు, చేనేత కార్మికులు మీ హయాంలో ఎక్కువ ఆత్మహత్యలు చేసుకున్నారంటే మీ హయాంలో ఎక్కువ చేసుకున్నారని కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు పరస్పర నిందలు వేసుకోవడం వింటున్నాం. ఇద్దరి పాలనలోనూ ఆత్మహత్యలు చేసుకొన్నారన్నది మాత్రం మనమందరం ఎరిగిన సత్యం. ఈ ఆత్మహత్యలకు గల కారణాల గురించి అనేక అధికార, అనధికార పరిశోధనలు జరిగాయి, విశ్లేషణలు జరిగాయి. రైతుల ఆత్మహత్యలు ఆగాలంటే విత్తనాలు, ఎరువులు, మందుల నాణ్యతకు ప్రభుత్వం ఆచరణాత్మకమైన భరోసా ఇవ్వాలనీ, రైతులు పంట పండి ధరపలికినప్పుడు బాకీలు తీరుస్తారన్న విశ్వాసంతో ఏ షరతులూ లేకుండా సరళమైన రుణాలిచ్చే ప్రభుత్వ బ్యాంకింగ్ వ్యవస్థ ఉండాలనీ, మార్కెట్‌లో ధర పడిపోయినప్పుడు కనీస మద్దతు ధరకు పంట యావత్తూ కొనుగోలు చేసే ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ ఉండాలనీ విశ్లేషకులంతా అన్నారు. నేత కార్మికుల ఆత్మహత్యలు, ఆకలి చావులు ఆగాలంటే ప్రతిరోజూ కార్మికులందరికీ పని దొరకాలి, చేసిన పనికి కనీస వేతనమైనా లభించాలి, ఒక మగ్గం మీద ఇంట్లో ఎంత మంది పనిచేస్తే అంతమందికీ ఈ వేతనం లభించాలి, దీనికి కావలసిన అమ్మకము, కొనుగోలు వ్యవస్థలను ప్రభుత్వం రూపొందించాలి అని అన్నారు. ఇవి రెండూ సులభమైన విషయాలు కావు. వీటి గురించి చాలా అధ్యయనం కావాలి, వ్యవస్థల రూపకల్పన జరగాలి, ఖర్చుకు సిద్ధపడాలి. **ఏ పార్టీ అయినా వీటి గురించి ఆలోచిస్తున్నదా? నిర్దిష్టమైన చర్యలు ప్రతిపాదించిందా? కచ్చితమైన హామీలు ఇస్తున్నదా?** అవేవీ లేకుండా రైతన్న నేతన్న అంటూ కవిత్వం చదివితే ఏమొస్తుంది?

## 4. ఉపాధి హామీ



గ్రామీణ పేదరికాన్ని, వలసలను, ఆకలిచావులను నిరోధించడానికి ఉపాధి హామీ పథకం ఒక ముఖ్య సాధనంగా ఉనికిలోకి వచ్చింది. అడిగిన ప్రతి ఒక్కరికీ సంవత్సరంలో 100 రోజుల పని, పని ఇవ్వలేనప్పుడు నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నవి ఇందులోని ముఖ్య విషయాలు. 100 కాదు కదా, 30 రోజులు మించి పని కల్పించడం లేదు. నిరుద్యోగ భృతి అసలే ఇవ్వడం లేదు. ఈలోపల పంటల కాలంలో ఉపాధి హామీ పనులు చేపడితే రైతులకు ఉండగల కష్టాన్ని గురించి అవసరమైన దానికంటే ఎక్కువ రచ్చచేసి ఆ 30 రోజులు కూడా దక్కని పరిస్థితి కల్పించారు. **ఈ పథకం ఆశించిన ఫలితంలో మూడవ వంతుకూడ ఇవ్వకపోవడాన్ని గురించి ఏ పార్టీ అయినా విశ్లేషణ చేసిందా? అసలు ఆలోచించిందా? ఆ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడానికి నిర్దిష్టమైన హామీ ఒక్కటయినా ఈ పార్టీలు ఇచ్చాయా? ఇదేమీ లేకుండా రోడ్‌షోలలో పేదరికాన్ని గురించి సినిమా డైలాగులు వల్లిస్తే సరిపోయిందా?**

## 5. చట్టం పట్ల గౌరవం

పోలీసు హింసకు పరాకాష్ట అయిన 'ఎన్‌కౌంటర్' హత్యలను అదుపు చేయడానికి తోడ్పడే ఒక ముఖ్యమైన తీర్పు మన రాష్ట్ర హైకోర్టు ఇచ్చింది. **ఆ తీర్పు తప్పక అమలయ్యేటట్లు చూస్తామనీ, పోలీసు వ్యవస్థ ప్రజల హక్కులను గౌరవించి నడుచుకునేటట్టు తీర్చిదిద్దుతామనీ ఒక్క పార్టీ అయినా ఈ ఎన్నికల సీజన్‌లో హామీ ఇచ్చిందా?** దళిత వర్గాలపైన దాడులను, వివక్షను అరికట్టేందుకు దేశ పార్లమెంటు జారీ చేసిన ఎస్‌సిఎస్‌టి (అత్యాచారాల నిరోధక) చట్టానికి 20 ఏళ్లు నిండాయి. ఆ చట్టం అమలును మెరుగుపరిచే ఉద్దేశ్యంతో జస్టిస్ పున్నయ్య కమిషన్ గత ప్రభుత్వపు చివరి రోజులలో చాలా సూచనలు చేసింది. వాటి అమలు కోసం కొన్ని జీవోలు కూడా వెలువడ్డాయిగానీ ఏ ఒక్కటీ అమలు కాలేదు. **ఇదెందుకు అని ఏ పార్టీ అయినా ఆలోచించిందా? ఆ చట్టాన్ని నిజంగా బలోపేతం చేయడానికి ఫలాన చర్యలు చేపట్టబోతామన్న నిర్దిష్టమైన హామీ ఏ పార్టీ అయినా ఇస్తున్నదా? ఏ ప్రచారకుడయినా దీని గురించి మాట్లాడుతున్నాడా?**

## 6. ఈ మూడు ఆకాంక్షల మాటేమిటి?

వివిధ ప్రజా వర్గాలలో ఉన్న ప్రజాతంత్ర ఆకాంక్షలను అన్ని పార్టీలూ ఒప్పుకున్నట్టే ఒప్పుకొని నినాదాలుగా మార్చి చేతులు దులిపేసుకోవడం చూస్తున్నాం. ఎవరూ కాదననట్టే ఉంటుంది, కానీ ఆకాంక్ష తీరదు. చట్ట సభలలో స్త్రీలకు రిజర్వేషన్లు, ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం అనే మూడు బలమైన ఆకాంక్షలకు మన కళ్లముందే ఈ గతి పట్టించారు. **ఈ కపటత్వాన్ని గురించి మనం అన్ని పార్టీలనూ వారి అభ్యర్థులనూ అడగొద్దా?**

మనకు ఈ పార్టీలన్నీ ఇస్తున్న హామీలు డబ్బు పడేస్తే తీరేవి. ఇవ్వని హామీలు సామాజిక ఆర్థిక వ్యవస్థను కదిలించేవి. చవక బియ్యమూ ఉచిత కరెంటూ ప్రజలకు ఇయ్యొద్దని ఎవరూ అనరుగానీ అవి అవసరం కావడానికి కారణం సామాజిక ఆర్థిక స్థితిగతులు, అవకాశాలలోని అసమానతలు. వాటిని తొలగించే ఆలోచన, సంకల్పం ఏ పార్టీకీ లేదు. వారు ఇస్తున్న హామీలలో ఈ కర్తవ్యానికి చోటులేదు. డబ్బు పడేస్తే ఒనగూడే హామీలు మాత్రమే వారి అజెండాలో ఉన్నాయి. **ఇదెందుకు అని మనం వారిని అడగొద్దా?**

## ఆ డబ్బులు ఎక్కడినుండి వస్తాయి?

మీ హామీలకు రాష్ట్ర బడ్జెట్ చాలదంటే మీ హామీలకు దేశ బడ్జెట్ చాలదంటూ ఈ పార్టీలు ఒకరినొకరు ఎద్దేవా చేయడం వింటున్నాం. నిజంగానే ఇవి ఖరీదయిన హామీలు. ఇస్తే ఇచ్చారు వద్దనడం లేదుగానీ ప్రజల జీవిత వనరులను వారికి దూరం చేసి పెట్టుబడిదారీ కంపెనీల చేతులలో పెడుతున్న చేదువాస్తవాన్ని కప్పిపెట్టడానికి ఆ సంతర్పణ నుండి ప్రభుత్వానికొచ్చే ఆదాయంలో కొంత భాగం ఈ హామీలకోసం వెచ్చించి ప్రజలను సంతృప్తి పరుస్తున్నారేమో చూడాలి.

సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్‌లు, విమానాశ్రయాలు, ఓడరేవులు, ఆరువరుసల, ఎనిమిది వరుసల రహదార్లు, పారిశ్రామిక వాడలు, గనులు మొదలైనవాటికోసం లక్షల ఎకరాల భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతులలోనికి, ప్రైవేట్ కంపెనీల చేతులలోనికి పోతుండడం కొన్నేళ్లుగా చూస్తున్నాం. దీనివల్ల ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదాయమే అన్ని రకాల 'ఉచిత హామీ'లకూ ప్రధాన ఆధారం. అన్ని పార్టీలూ ఆ హామీలిస్తున్నాయంటే అర్థం అన్ని పార్టీలకూ ఇది సమ్మతమేనని. అన్ని పార్టీలూ దీనినే అభివృద్ధిగా భావిస్తున్నాయని. అందుకే ఈ అభివృద్ధి నమూనాకు వ్యతిరేకంగా ఏ పార్టీ మాట్లాడడంలేదు. రాష్ట్రంలోకి భారీగా పెట్టుబడులను తీసుకురావడానికి ప్రజల జీవన వనరులయిన భూమి, నీళ్లు, వృక్షసంపదలను పెట్టుబడిదార్ల కప్పగించి ప్రజలను ఏ వనరులూ లేని దిన కూలీలుగా మారుస్తున్నారు. ఈ వికృతమైన అభివృద్ధే అన్ని పార్టీల నమూనా.

**కాదని ఏ పార్టీ అయినా అంటుందా? కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ 'అభివృద్ధి' యావత్తూ కాంగ్రెస్‌వారికీ వారి బంధు మిత్రులకూ అక్రమంగా కోట్లు సంపాదించి పెడుతున్నదన్న ఆరోపణ మిగిలిన పార్టీలు చేస్తున్నాయి. అది నిజమేగానీ ఈ అభివృద్ధే విధ్వంసకం అని ఒకరయినా అంటున్నారా?** ఇన్ని దశాబ్దాల పారిశ్రామిక అభివృద్ధి తరువాత కూడా జనాభాలో అధికశాతం ప్రకృతిపైన ప్రత్యక్షంగా ఆధారపడి బతుకుతున్న భారతదేశంలో, ప్రకృతిని పెట్టుబడికి వనరుగా చూడడం లక్షలాది ప్రజల జీవితాన్ని ధ్వంసం చేసే వైఖరి అని ఏ పార్టీ అయినా అంటున్నదా? ప్రజల జీవిత వనరు అయిన ప్రకృతి సంపదను ప్రజల వద్దనే ఉండనిచ్చి, వారి కోసం దానిని అభివృద్ధిచేసి, వారి జీవితాల మెరుగుదల ద్వారా రాష్ట్రాన్నీ, దేశాన్నీ అభివృద్ధిచేసే ప్రత్యామ్నాయ అభివృద్ధి నమూనాను అన్వేషిస్తామనీ, అమలు చేస్తామనీ ఏ పార్టీ అయినా అంటున్నదా? విధ్వంసకమైన ఈ అభివృద్ధి ఫలాలను ఒకే పార్టీవారూ ఒకే అగ్రకులానికి చెందినవారూ పొందుతున్నారని ఇతర పార్టీలవారూ ఇతర అగ్రకులాలవారూ ప్రదర్శిస్తున్న ఉక్రోషం గొప్ప రాజకీయ సంవాదం అని పత్రికలు, టీవీలు మనకు చెప్తున్నాయి. మనమూ నమ్మి అందులో కొట్టుకుపోదామా లేదా అందరినీ కలిపి నిలదీసి ప్రజల బాగును ప్రత్యక్ష లక్ష్యంగాగల అభివృద్ధి నమూనాను రూపొందించండి, ఆచరించండి అని ఎన్నికలప్పుడు మనవద్దకొచ్చే వారందరినీ డిమాండ్ చేద్దామా?

ఆలోచించమని ప్రజలను కోరుతూ....

**1 ఏప్రిల్, 2009**

మానవ హక్కుల వేదిక
**Human Rights Forum (HRF)**